ఆకాశవాణి హైదరాబాద్ కేంద్ర

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ. 10.07.2026 సమయం. 13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ రోజు ఖమ్మం జిల్లాలో పలు అభివృద్ధి కార్యక్రమాలలో పాల్గొననున్నారు.

2. మత్స్యకారుల సమగ్ర అభివృద్ధి, వారి ఆదాయ వృద్ధే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మత్స్యశాఖ మంత్రి వాకిటి శ్రీహరి తెలిపారు.

3. సింగరేణి సంస్థను కాపాడి, కార్మికుల ప్రయోజనాలను పరిరక్షించడమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి చెప్పారు.

4. రాష్ట్రంలోని చాలా ప్రాంతాల్లో ఈరోజు , రేపు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలియజేసింది.

------------------------------

**రేవంత్ పర్యటన భట్టి**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ మధ్యాహ్నం ఖమ్మం జిల్లాలో పాల్గొనబోయే రైతు ఆశీర్వాద సభకు అధికారులు ఏర్పాట్లన్నీ పూర్తి చేశారు. సభా స్థలిని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, వ్యవసాయ తుమ్మల నాగేశ్వరరావు, కలెక్టర్ దివాకర, సీపీ సునీల్ దత్ తదితరులు పరిశీలించారు. ఈ సభను విజయవంతం చేయాలని ఉప ముఖ్యమంత్రి ప్రజలను కోరారు.

**Sound Byte భట్టి**

**పీటీసీ - ఖమ్మం**

-----------------------------------

**వాకిటి**

మత్స్యకారుల సమగ్ర అభివృద్ధి, వారి ఆదాయ వృద్ధే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మత్స్యశాఖ మంత్రి వాకిటి శ్రీహరి తెలిపారు. రంగారెడ్డి జిల్లా కోహెడలో 47 కోట్ల 3 లక్షల రూపాయలతో నిర్మించనున్న ఎగుమతి ఆధారిత హోల్‌సేల్ చేపల మార్కెట్‌కు ఆయన ఈ ఉదయం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, సముద్రతీర ప్రాంతం కాకుండా దేశంలోనే తొలిసారిగా అంతర్జాతీయ స్థాయి మంచినీటి చేపల ఎగుమతి కేంద్రం తెలంగాణలో ఏర్పాటు కావడం చారిత్రాత్మకమని చెప్పారు. ఈ కేంద్రం అందుబాటులోకి వస్తే రాష్ట్రంలో ఉత్పత్తి అయ్యే చేపలకు జాతీయ, అంతర్జాతీయ మార్కెట్లు లభించి మత్స్యకారులకు మెరుగైన ధరలు దక్కుతాయని తెలిపారు. ఆధునిక శీతల గిడ్డంగులు, ప్యాకేజింగ్, శుద్ధి యూనిట్లు, కస్టమ్స్ సదుపాయాలతో ఈ కేంద్రం ఏర్పాటవుతుందని, దీని ద్వారా సుమారు ఐదు వేల మందికి ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి అవకాశాలు లభిస్తాయని మంత్రి పేర్కొన్నారు. ఈరోజు జాతీయ మత్స్యకారుల దినోత్సవం సందర్భంగా మంత్రి వాకిటి శ్రీహరి శుభాకాంక్షలు తెలిపారు.

**డెస్క్**

----------------------------

**కిషన్ రెడ్డి**

సింగరేణి సంస్థను కాపాడి, కార్మికుల ప్రయోజనాలను పరిరక్షించడమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ... ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నిర్ణయంతో తాడిచర్ల-2 బొగ్గు గనిని సింగరేణికి కేటాయించడం చారిత్రాత్మకమన్నారు. తాడిచర్ల-2లో 434 మిలియన్ టన్నులు, ఒడిశాలోని నైనీ బ్లాక్‌లో 455 మిలియన్ టన్నుల బొగ్గు నిల్వలతో సింగరేణికి దీర్ఘకాలిక ఇంధన భద్రత లభిస్తుందని చెప్పారు. ఈ రెండు గనుల ద్వారా రాబోయే దశాబ్దాల్లో 2 లక్షల 25 వేల కోట్ల రూపాయల టర్నోవర్, 3 వేల 500 కొత్త ఉద్యోగాలు లభిస్తాయని వెల్లడించారు. సింగరేణికి రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సిన 54 వేల కోట్ల రూపాయలకు పైగా బకాయిలను

వెంటనే విడుదల చేయాలని కిషన్ రెడ్డి డిమాండ్ చేశారు. సింగరేణి తెలంగాణ ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీక అని, దాని పరిరక్షణకు అన్ని రాజకీయ పార్టీలు, కార్మిక సంఘాలు కలిసి పనిచేయాలని కిషన్ రెడ్డి పిలుపునిచ్చారు.

**డెస్క్**

---------------------------

**పొన్నం**

హైదరాబాద్‌లోని 169  బస్తీ దవాఖానల పనితీరును ఈరోజు ప్రత్యేక అధికారులు తనిఖీ చేయనున్నట్లు హైదరాబాద్ ఇన్‌చార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. దీనికోసం ప్రత్యేక అధికారులను నియమించినట్లు హైదరాబాద్ ఇంచార్జ్ మంత్రి వెల్లడించారు. అలాగే, తనతో పాటు జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్, జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అలా రాబోయే రెండు మూడు రోజుల పాటు ఎంపిక చేసిన ముఖ్యమైన బస్తీ దవాఖానలను స్వయంగా తనిఖీలు చేస్తామని, వర్షాకాలంలో డెంగ్యూ, మలేరియా, వైరల్ జ్వరాల నివారణకు వైద్య సేవలను బలోపేతం చేయడమే లక్ష్యమన్నారు. వైద్యులు, సిబ్బంది అందుబాటు, మందుల నిల్వలు, ప్రయోగశాల సేవలు, పరిశుభ్రత, మౌలిక వసతులను పరిశీలించి లోపాలను వెంటనే సరిదిద్దాలని అధికారులను ఆదేశించారు. ప్రజా ప్రతినిధులు కూడా బస్తీ దవాఖానలను సందర్శించి సేవల మెరుగుదలకు సహకరించాలని మంత్రి కోరారు.

**డెస్క్**

**దామోదర**

రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ పరిధిలో శానిటేషన్, సెక్యూరిటీ, పేషంట్ కేర్ సేవల్లో పనిచేస్తున్న అవుట్‌సోర్సింగ్ సిబ్బందికి ప్రతి నెల మొదటి తేదీన వేతనాలు అందేలా చర్యలు తీసుకుంటామని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు ప్రభుత్వ ఉద్యోగులతో పాటు కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ సిబ్బందికీ సకాలంలో వేతనాలు చెల్లించే విధంగా చర్యలు చేపడుతున్నట్లు

చెప్పారు. పోర్టల్ విధానంలో అవసరమైన సవరణలు చేసి ప్రతి నెల మొదటి తేదీన వేతనాలు విడుదలయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు.

డెస్క్

**హెచ్ఆర్సీ**

నాగర్‌కర్నూలు జిల్లా , అమ్రాబాద్ మండలం , మన్ననూర్ గిరిజన సంక్షేమ బాలుర గురుకులంలో ఫుడ్ పాయిజన్ ఘటనపై తెలంగాణ మానవ హక్కుల కమిషన్ సుమోటోగా విచారణ చేపట్టింది. పలువురు విద్యార్థులు అస్వస్థతకు గురైన ఘటనకు సంబంధించి పరిస్థితులు, విద్యార్థుల ఆరోగ్య స్థితి , ఆహారం, తాగునీటి నమూనాల పరీక్ష ఫలితాలు , బాధ్యులపై తీసుకున్న చర్యలు, భవిష్యత్తు నివారణ చర్యలపై సమగ్ర నివేదిక సమర్పించాలని నాగర్‌కర్నూలు జిల్లా కలెక్టర్‌ను ఆదేశించింది. తదుపరి విచారణను ఆగస్టు 11కు వాయిదా వేసింది.

డెస్క్

**సీఎస్ గవర్నర్**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఈ ఉదయం రాజ్‌భవన్‌లో గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాను మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. ఇటీవల చీఫ్ సెక్రెటరీగా బాధ్యతలు స్వీకరించిన సంజయ్ జాజుకు గవర్నర్ అభినందనలు తెలిపారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధి, ప్రజా సంక్షేమం, సుపరిపాలన లక్ష్యాల సాధనలో సమర్థవంతంగా పనిచేయాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలియజేశారు.

డెస్క్

**క్రీడలు**

క్రీడలు మానసిక, శారీరక దృఢత్వాన్ని పెంపొందించడంతో పాటు విధుల్లో నిత్యం నిమగ్నమై ఉండే పోలీసు సిబ్బందికి పని ఒత్తిడి నుంచి ఉపశమనం కలిగిస్తాయని జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ అన్నారు. నాలుగో వార్షిక జిల్లా పోలీసు క్రీడలను ఆయన ప్రారంభించి

మాట్లాడుతూ... క్రీడాస్ఫూర్తితో పోటీల్లో పాల్గొనడం ద్వారా సిబ్బంది మధ్య సఖ్యత పెంపొందడంతో పాటు విధుల నిర్వహణలో మరింత సమన్వయం ఏర్పడుతుందని అన్నారు .

**బైట్ - అశోక్ కుమార్ ఎస్పీ**

**పీటీసీ - జగిత్యాల**

**లోక్ అదాలత్**

చెక్కు బౌన్స్ కేసుల త్వరిత పరిష్కారం కోసం ఈ నెల 18 న నాంపల్లిలోని మనోరంజన్ కాంప్లెక్స్, సికింద్రాబాద్ కోర్టుల్లో ప్రత్యేక లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ తెలిపింది. చెక్కు బౌన్స్ కేసులను సుదీర్ఘ న్యాయ ప్రక్రియకు బదులుగా పరస్పర రాజీ ద్వారా త్వరగా పరిష్కరించేందుకు లోక్ అదాలత్ సమర్థవంతమైన వేదిక అని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్, సెషన్స్ జడ్జి కె. సాయి రమాదేవి తెలియజేశారు.

**డెస్క్**

**చాడ**

ఆగస్టు 6 నుంచి 14 వరకు దేశవ్యాప్తంగా సీపీఐ ఆధ్వర్యంలో పాదయాత్రలు నిర్వహించనున్నట్లు ఆ పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట్ రెడ్డి తెలిపారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... సెప్టెంబర్ 1న ఢిల్లీలో లక్ష మందితో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు చెప్పారు. ప్రజలు ఈ కార్యక్రమాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

**పీటీసీ - సిరిసిల్ల**

**వాతావరణం**

రాష్ట్రంలోని చాలా ప్రాంతాల్లో ఈరోజు , రేపు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు , ఉరుములతో కూడిన జల్లులు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలియజేసింది.

అలాగే, గంటకు 40 నుంచి 60 కిలోమీటర్ల వేగంతో బలమైన గాలులు వీచే అవకాశం ఉందని హెచ్చరించింది.

**పీఎస్**

**ప్రమాదం**

రాజన్న సిరిసిల్ల జిల్లా నాంపల్లి ఇస్లాం నగర్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతి చెందగా, 20 మంది గాయపడ్డారు. మహారాష్ట్రలోని చంద్రాపూర్ జిల్లాకు చెందిన కూలీలు బోయిన్‌పల్లి మండలం, జగ్గారావుపల్లి వద్ద ఉంటూ వ్యవసాయ పనులకు వెళ్తుండగా, వారు ప్రయాణిస్తున్న టాటా ఎస్ వాహనాన్ని సిరిసిల్ల డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. క్షతగాత్రులు సిరిసిల్ల ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.

**పీటీసీ - సిరిసిల్ల**

**ఎస్పీ**

సోషల్ మీడియాను ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వినియోగించాలని ఆసిఫాబాద్ జిల్లా ఎస్పీ నితికా పంత్ సూచించారు. ఎవరినైనా కించపరిచే పోస్టులు, అసత్య ప్రచారం, అవమానకర వ్యాఖ్యలు, విద్వేషాలను రెచ్చగొట్టే సందేశాల ప్రచారం చట్టరీత్యా నేరమని హెచ్చరించారు.

**పీటీసీ - ఆసిఫాబాద్**

**శిక్షణ**

ఆసిఫాబాద్ జిల్లాలోని నిరుద్యోగ ఎస్సీ యువతకు ఉచిత సివిల్స్ ప్రిలిమినరీ, మెయిన్స్ పరీక్షల శిక్షణ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి అశోక్ తెలిపారు. గతంలో తెలంగాణ స్టడీ సర్కిల్ ద్వారా సివిల్స్ కోచింగ్ పొందిన వారు దీనికి అర్హులు కాదన్నారు. ఈనెల 19 లోగా ఆన్‌లైన్‌లో తెలంగాణ స్టడీ సర్కిల్ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

**పీటీసీ - ఆసిఫాబాద్**

**కలెక్టర్**

కీటక జనిత వ్యాధుల నివారణకు ఫ్రైడే - డ్రైడే కార్యక్రమంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి పిలుపునిచ్చారు. ఆరోగ్య, ఆశా, అంగన్‌వాడీ

సిబ్బంది ఇంటింటికీ వెళ్లి పరిశుభ్రత, దోమల నివారణ, జ్వరాల నియంత్రణపై అవగాహన కల్పిస్తున్న తీరును కలెక్టర్ పరిశీలించారు.

**పీటీసీ - వనపర్తి**

**కవిత**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరులో తమ డిమాండ్ల సాధన కోసం ఆందోళన చేస్తున్న సింగరేణి ఉద్యోగులకు తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... సింగరేణి పెండింగ్‌లో ఉన్న పీఆర్సీ, పే రివిజన్‌ను వెంటనే అమలు చేయాలని ఆమె డిమాండ్ చేశారు.

**పీటీసీ - భద్రాద్రి**

**మై భారత్**

సంగారెడ్డి జిల్లాలో మై భారత్ ఇంటెన్సివ్ రిజిస్ట్రేషన్ డ్రైవ్‌ను జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ప్రారంభించారు. 15 నుంచి 29 సంవత్సరాల మధ్య వయస్సు గల యువత మై భారత్ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. మైభారత్ వెబ్‌సైట్ ద్వారా నమోదు చేసుకుంటే ప్రభుత్వ యువజన కార్యక్రమాలు, స్వచ్ఛంద సేవా అవకాశాలు, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనే అవకాశం లభిస్తుందని తెలిపారు. జిల్లాలో నమోదు లక్ష్యాన్ని సాధించేందుకు ప్రతి గ్రామం, మండలంలో ప్రత్యేక శిబిరాలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.

**పీటీసీ - సంగారెడ్డి**

**డైరెక్టర్**

సింగరేణి వ్యాప్తంగా కార్మికుల రక్షణకు మొదటి ప్రాధాన్యత ఇస్తున్నామని సంస్థ డైరెక్టర్ కె. వెంకటేశ్వర్లు తెలిపారు. మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్ డివిజన్ నస్పూర్‌లో నిర్వహించిన 24వ వార్షిక త్రైపాక్షిక భద్రతా సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రమాద రహిత సింగరేణిగా సంస్థను తీర్చిదిద్దడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని చెప్పారు.

**పీటీసీ - మంచిర్యాల**